క్లుప్తంగా

ఈవీఎంల మొరాయింపు

త్రిపురారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 271వ పోలింగ్ బూత్, బాబు సాయి పేటలో 263పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఎక్కువ సేపు క్యూ లైన్‌లో నిలబడి ఆలస్యం ఓటు వేయవల్సి వచ్చింది. అలాగే బాబుసాయి పేట, పెద్దదేవుల పల్లి, నర్లకంటి గూడెం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను బీఆర్ఎస్ అభ్యర్థి భగత్ యాదవ్ చేరుకొని ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఆప్యాయం పలకరించారు. ఆయన వెంట మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండలంలోని తిరుమలగిరి, రాజవరం, రంగుండ్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్ పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేయడంలో ఎలాంటి ఘర్షలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఒకరి పేరున మరొకరు ఓటు

మోతె : మండలంలో ఏర్పాటు చేసిన 48 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ఓటర్లు తమ ఓట్లు వినియోగించుకున్నారు. పోలింగ్ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మందకొడిగానే జరిగింది. రావిపహాడ్‌లోని 2, 3 నంబర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. నామవరంలోని 36వ పోలింగ్ కేంద్రంలో కొమ్మ లింగమ్మ భర్త లింగయ్య అనే మహిళా ఓటరుకు బదులుగా కొమ్మ లింగమ్మ భర్త చిన్నాయన అనే మరో మహిళా ఓటర్ స్లిప్ లేకుండానే ఓటు వేసింది. దీంతో కొమ్మ లింగమ్మ భర్త లింగయ్య ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లగా లింగమ్మ పేరున ఓటు వేసినట్లు ఓటరు లిస్టులో ఉందని పోలింగ్ సిబ్బంది తెలిపారు. దీంతో ఆమె ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రంలో సెల్ఫీ వీడియో

- యువకుడిపై కేసు నమోదు

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో ఓ యువకుడు ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసిన సంఘటన జరిగింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకొచ్చి సెల్ఫీ వీడియో తీయడం పట్ల సంబంధిత సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం

అనంతగిరి : త్రిపురవరంలోని 159, 160 పోలింగ్ బూత్‌లలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బూత్‌లలోకి వెళ్లి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై అక్కడే ఉన్న పోలీస్ సిబ్బందికి మూడు సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. ఈవిషయంపై కాంగ్రెస్ నాయకులకు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న బీఆర్ఎస్ నాయకులను బయటకు పంపిచడంతో సర్దుమణిగింది.

పోలీస్ అధికారికి, ఎమ్మెల్యేకు మధ్య..

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో హుజూర్‌నగర్‌లోని వీవీఎం స్కూల్‌లోని పోలింగ్ బూత్ వద్దనున్న ఓ పోలీస్ అధికారికి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సైదిరెడ్డిల మధ్య గురువారం స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. పోలింగ్ బూత్‌లోకి మెడలో గులాబీ కండువా వేసుకుని వెళ్తున్న సైదిరెడ్డిని కండువా తీసి వెళ్లాలని పోలీసు అధికారి కోరారు. కండువాపై గుర్తులు ఏమీ లేవని ఎమ్మెల్యే పోలీస్ అధికారికి సమాధానమిచ్చారు. ఈ విషయమై ఇరువురి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఇతరులు సర్దిచెప్పడంతో వివాదం ముగిసింది.

మాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దాత, నిర్వాహకులు

కోదాదరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అయ్యప్ప మాలధారులకు గురువారం అన్నదాన కార్యక్రమాన్ని బద్రిగౌడ్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో 450 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, బర్మావత్ సీతారాంసింగ్, గడ్డం సూర్యారెడ్డి, రంగా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలింగ్

- పలు చోట్ల స్వల్ప ఘర్షణలు
- కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపు
- మిర్యాలగూడలో 83.47, దేవరకొండలో 83.95, నాగార్జున సాగర్‌లో 85.8 శాతం నమోదు



ఓటు హక్కు వినియోగించుకున్న మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్



దేవరకొండ : తాటికోల్‌లో బారులుదీరిన ఓటర్లు



పెద్దవూర : రామన్నగూడెంలో సమయం ముగిసిన తరువాత క్యూలో వేచి ఉన్న ఓటర్లు





ఓటు హక్కు వినియోగించుకున్న టీటీడీ బోర్డు సభ్యుడు వెంకటేష్, మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపురెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన ఎన్నికల పోలింగ్ ప్రక్రియ చెదురుమొదురు ఘటనల మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల సమయంలో స్వల్పంగా ఓటింగ్ నమోదు కాగా ఉదయం 9గంటలకు 6.6శాతం, 11గంటలకు 21.06, 1గంటలకు 39.21, 3గంటలకు 59.12, 4గంటలకు 65.1, 5గంటలకు 77.52శాతంగా పోలింగ్ నమోదైంది. కాగా పట్టణంలోని మాడిసన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో సుమారు అరగంట సేపు ఈవీఎంలు మొరాయించడంతో అప్రమత్తమైన రూట్ ఆఫీసర్లు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పోలింగ్ సజావుగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. సాయంత్రం 5గంటల తరువాత కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరారు. నియోజకవర్గంలో 2,31,391 మంది ఓటర్లు ఉండగా 193140 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 83.47 శాతంగా నమోదైంది.

చెదురుమొదురు ఘటనలు

మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డికాలనీ, బంగారుగడ్డ పోలింగ్ బూత్‌ల వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల నడుమ స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. అడవిదేవులపల్లి మండలంలోని చాంప్లాతండా వద్ద స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగింది. వేములపల్లి మండలంలోని ఆమనగల్లు, లక్ష్మీదేవిగూడెం, శెట్టిపాలెం, మొల్కపట్నం, వేములపల్లి గ్రామాల్లో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల రాకతో గొడవ సద్దుమణిగింది. ఆమనగల్లు, శెట్టిపాలెం గ్రామాల్లో సాయంత్రం 6.30గంటల వరకు పోలింగ్ సాగింది. దామరచర్ల మండలంలోని రాళ్లవాగు తండాలోని పోలింగ్ ఏజెంట్లు ఓటర్లను ప్రభావితం చేస్తున్నారంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు ఘర్షణ పడగా పోలీసులు జోక్యం చేసుకోని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. మాడ్గులపల్లి మండలంలో ఉదయం 11గంటల వరకు మందకొడిగా పోలింగ్ సాగి తరువాత ఊపందుకుంది. సాగర్ నియోజకవర్గంలోని 7గ్రామాల్లో 90శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో 85నుంచి 90శాతం పోలింగ్ నమోదైంది. పుచ్చకాయలగూడెంలో ఉదయం 8గంటల సమయంలో వీవీ ప్యాట్ యంత్రం పనిచేయకపోవడంతో 15నిమిషాలపాటు పోలింగ్ నిలిచింది. సీత్యాతండాలో పోలింగ్ కేంద్రం లేకపోవడంతో కిలోమీటర్ దూరం వెళ్లి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమస్యాత్మక గ్రామాలైన పాములపాడు, చిరుమర్తి, ఆగామోత్కూర్, కల్వలపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాల పర్యవేక్షణలో పోలింగ్ జరిగింది. మాడ్గులపల్లి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించారు.

సాగర్‌లో పోలింగ్ 85.8శాతం

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో స్వల్ప సంఘటనలు మినహా గురువారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. ఎలాంటి అవాఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు హక్కును సాఫీగా వినియోగించుకున్నారు.



మిర్యాలగూడటౌన్ : ఆలగడపలో క్యూలో నిల్చున్న ఓటర్లు



అడవిదేవులపల్లి : చాంప్లాతండాలో బారులుదీరిన ఓటర్లు

సార్వత్రిక ఎన్నికలు ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కాగా 8గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులుదీరారు. సాయంత్రం ఐదు గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారందరినీ ఓటు వేసేందుకు అధికారులు అనుమతించారు. ఉదయం కొంతమందకొండిగా సాగినా మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. సాగర్ నియోజకవర్గంలోని నందికొండ మున్సిపాలిటీలోని 103 పోలింగ్ కేంద్రంలో కొద్దిసేపు ఈవీఎం మొరాయించింది. దీంతో అక్కడ అరగంట పోలింగ్ నిలిచింది. అనంతరం ఎన్నికల అధికారులు ఈవీఎంను సరి చేయడంతో యథావిధిగా పోలింగ్ కొనసాగింది. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేటలో 169పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అదే విధంగా త్రిపురారం మండలంలోని బాబుసాయి పేట గ్రామంలో 263పోలింగ్ బూత్, త్రిపురారం మండలకేంద్రంలోని 271పోలింగ్ బూత్ మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్ ఆలస్యం జరిగింది. ఆ తరువాత ఈవీఎంలను ఎన్నికల అధికారులు సరి చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది. పోలింగ్ రాత్రి 7.30 గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గంలో సుమారు 85.8శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సరళిని నాగార్జున సాగర్ నియోజక వర్గ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు కుందూరు జయవీర్ రెడ్డి, భగత్ పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి పోలింగ్ శాతాన్ని ఎన్నికల అధికారులను తెలుసుకున్నారు.

దేవరకొండలో పోలింగ్ 83.95శాతం

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గంలో గురువారం అసెంబ్లీ సెగ్మెంట్ ఎన్నికలు చెదురుమొదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో గల 2,51,266 మంది ఓటర్లకు గాను 310 పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించారు. కొన్ని చోట్ల పోలింగ్ సమయానికి ఈవీఎంలు మొరాయించడంతో వాటి స్థానంలో అప్పటికప్పుడు ఈవీఎంలను ఏర్పాటు చేయడంతో పోలింగ్ ప్రారంభమైంది. ఇదిలా ఉంటే ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. నియోజకవర్గ పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 2,51,622 మంది ఓటర్లకు 2,11, 622 మంది ఓటు వేశారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించారు. కాగా పలు చోట్ల వృద్ధులు, దివ్యాంగులకు సరైన వసతులు కల్పించకపోవడంతో కొంత మేర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీతో పాటు 8 మంది సీఐలు, 12 మంది ఎస్ఐలు 300 మంది కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు..



దేవరకొండ : పోలింగ్ కేంద్రానికి ఓటు వేసేందుకు వృద్ధురాలిని తీసుకొస్తున్న సహాయకులు



పెద్దదేవులపల్లి :వస్త్రాం తండాలో వీల్ చైర్‌పై వృద్ధురాలిని తీసుకెళ్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది



నిడమనూరు : తుమ్మడంలో పోలింగ్ బూత్ వద్ద క్యూలో నిల్చున్న మహిళలు



హాలియా : వీల్‌చైర్‌లో ఓటు వేసేందుకు వస్తున్న వికలాంగులు



చింతపల్లి : కుర్మేడులోని పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శంషాద్దీన్



కొండమల్లేపల్లి : జెడ్పీహెచ్ఎస్ బూత్ వద్ద ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్



పెద్దదేవులపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సాగర్ బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్



మాడుగులపల్లి : తోపుచర్ల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూలో నిలిచిన మహిళలు

ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

మిర్యాలగూడ : పట్టణంలోని రెడ్డికాలనీలో డాహిల్ పాఠశాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి మినా ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీలోని 46వ వార్డులో చైతన్య స్కూల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి సాధినేని శ్రీనివాస్‌రావు హౌసింగ్‌బోర్డు కాలనీలోని 44వ వార్డులో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

హాలియా : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి సాగర్‌లో తన ఓటు హక్కు వినియోగించుకోగా, ఇబ్రహీంపేట గ్రామంలో 170పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ కుటుంబ సభ్యులతో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో నందికొండ మున్సిపాలిటీలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తిరుమలగిరి మండలంలోని బోయగూడెంలో ఓటు హక్కును వినియోగించుకోగా బీజేపీ అభ్యర్థి కంకనాల నివేదితరెడ్డి పులిచర్లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దేవరకొండ : ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దేవరకొండ మండల పరిధిలోని రత్యతండాలో తన ఓటు హక్కును వినియోగించుకోగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నేనావత్ బాలునాయక్ దేవరకొండ మండల పరిధిలోని కమలాపూర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేతావత్ లాలునాయక్ దేవరకొండ పట్టణంలోని పోలింగ్ బూత్ నం 87లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



మిర్యాలగూడ : కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న భాస్కర్‌రావు



మిర్యాలగూడ : ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి శ్రీనివాసరావు



హాలియా : ఓటు హక్కు వినియోగించుకున్న సాగర్ బీజేపీ అభ్యర్థి నివేదితారెడ్డి, కుటుంబ సభ్యులు



ఇబ్రహీంపేటలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేసిన నోముల భగత్



తిరుమలగిరి : బోయగూడెంలో ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి



దేవరకొండ : ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ అభ్యర్థి లాలునాయక్



దేవరకొండ : రత్యతండాలో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్



దేవరకొండ : కమలాపూర్‌లో ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్



నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలో ఓటు హక్కు వినియోగించుకున్న జైవీర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

ప్రత్యర్థులు ఎదురైన వేళ

చింతపల్లి : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పొద్దున్న లేస్తే ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటూ ప్రచారం సాగించుకున్న ఇద్దరు ప్రత్యర్థి పార్టీ నేతలు ఎదురెదురుగా తారపడితే ఎలా ఉంటుంది.. నియోజకవర్గానికి నువ్వు చేసిందేమీలేదంటే.. నువ్వు కూడా ఏం చేయలేదని మాటలు సంధించుకున్న ఆ నేతలిద్దరు చిరునవ్వుతో ఒకరినొకరు పలుకరించుకొని చేతులు కలుపున్నారు. దేవరకొండ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మొదలు ప్రారంభమైన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నేనావత్ బాలునాయక్‌లు ఒకరినొకరు విమర్శలు చేసుకున్నారు... తాజాగా గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ నంబర్ 33లో ఇరువురు నేతలు అనుకోకుండా ఎదురెదురుగా తారసపడ్డారు.. ఈ క్రమంలో ఇద్దరు ఇలా నవ్వుతూ చేతులు కలుపుకున్నారు. అంటే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు.. శాశ్వత శత్రువులు అంటూ లేరని ఎలా చెప్పవచ్చో.. అలాగే విమర్శలు.. ప్రతి విమర్శలు కూడా ఎన్నికలు ముగిసే వరకేనని ఓటర్లు చెప్పుకుంటున్నారు.



చింతపల్లి : జెడ్పీహెచ్ఎస్‌లో షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్న బాలునాయక్, రవీంద్రకుమార్

అమెరికా నుంచి వచ్చి ఓటుహక్కు వినియోగం

శాలిగౌరారం: అమెరికాలో విద్యనభ్యసిస్తున్న శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన జమ్ము అనిల్‌పవన్‌కుమార్ బుధవారం రాత్రి స్వదేశానికి వచ్చి గురువారం తన ఓటును వినియోగించుకున్నాడు. శాలిగౌరారంకు చెందిన జమ్ము రమేశ్–శ్రీలత దంపతుల కుమారుడు జమ్ము అనిల్‌పవన్ బీఫార్మసీ పూర్తిచేసి మాస్టర్‌డిగ్రీ కోసం గత సంవత్సరం అమెరికా దేశంలోని ఓహీఓ పట్టణానికి వెళ్లాడు. అసెంబ్లీ ఎన్నికల్లో తన ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా వచ్చాడు. ఈ సందర్భంగా అతడిని పలువురు అభినందించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న అనిల్‌పవన్‌కుమార్

కరీంనగర్ నుంచి వచ్చి ఓటేసిన ఎంబీబీఎస్ విద్యార్థిని

- అముక్తమాల్యదను అభినందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్

రామగిరి(నల్లగొండ): కరీంనగర్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతూ స్వగ్రామమైన తిప్పర్తి మండలం సర్వారంకు వచ్చి మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతి కంచనపల్లి అముక్తమాల్యదను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అభినందించింది. నేటి యువతకు స్ఫూర్తి కలిగించేలా అముక్తమాల్యద ఓటు వేసిన ఫొటోను అఫీషియల్ ట్విట్టర్ అకౌంట్‌లో ట్వీట్ చేసింది. ఈ సందర్భంగా సాక్షితో అముక్తమాల్యద మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును తొలిసారి వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. యువత తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఓటు వేసిన అముక్తమాల్యద